

నులిపురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-గోపాలపురం

నులిపురుగులను పూర్తిస్థాయిలో నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని ఎంపిడిఒ ఆర్. శ్రీదేవి అన్నారు.శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల మాత్రల సిబ్బందికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు వారు హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 5,009 మందికి, అన్నదేవరపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 8,870మంది కి నులిపురుగుల మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.శ్రీనివాసరావు, హుకుంపేట, అన్నదేవరపేట వైద్యులు తదితరులుపాల్గొన్నారు. **పెరవలి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ దామోదరరావు, వైద్యాధికారి సత్య కృష్ణవేణి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆల్బండజోలు మాత్రలు పంపిణీచేశారు.

వ్యాధుల కాలం.. నిర్వహణ భారం

- పంచాయతీలలను వేధిస్తున్న నిధులలేమి
- సచివాలయాల ఖర్చులు అదనపు భారం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో పంచాయతీలలను నిధుల లేమి వెంటాడుతోంది. వానాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. ఈ పరిస్థితులలో కనీసం నిర్వహణ ఖర్చులు లేక పాలనా యంత్రాంగం సతమతమవుతోంది. వచ్చే నిధులు రాకపోవడం, ఉన్న నిధులను ప్రభుత్వం మళ్లిస్తుండ డంతో పంచాయతీల్లో నిధుల కొరత ఏర్పడుతోంది. కనీసం పన్నులు పంచాయతీలకు జమకాని పరిస్థితి నెలకొంది. దీంతో చిన్నపాటి పనులు కూడా చేయడానికి నిధుల్లేక సర్పంచ్‌లు చేతులెత్తేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పంచాయతీల్లో పాలన కుంటుపడు తోంది. పంచాయతీలలో వానాకాలంలో పారిశుధ్య నిర్వహణ, బ్లీచింగ్, తాగునీటి సరఫరాతో పాటు చిన్న చిన్న రహదారులు నిర్మాణం వంటి పనులకు పంచాయతీ నిధులను వినియోగించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. మరో వైపు సచివాల యాల నిర్వహణ అదనపు భారంగా మారింది. జిల్లాలో పంచాయతీల పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని సర్పంచ్‌లే చెబుతున్నారు. తాము సర్పంచ్‌లుగా ఎన్నికైనా పనులు చేయడానికి నిధులు లేమి, మరో పక్క అధికారాలు అంతంత మాత్రంగా ఉండడంతో పాలన కష్టతరంగా మారిందని వాపోతున్నారు. పంచా యతీలకు ఆసరాగా నిలిచే ఆర్థిక సంఘ



గ్రామ పంచాయతీ కార్యాలయం

నిధులు విద్యుత్ బిల్లులకు జమ చేస్తుండడంతో పంచాయతీల్లో నిధుల లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

పంచాయతీలపై అదనపు భారం

జిల్లాలో 300పంచాయతీలున్నా యి. ఈ పంచా యతీల్లో నిర్వ హణ భారంగా పరిణమిం చింది. గతంలో బిల్లు కలెక్టర్లు ఉండడంతో పంచాయతీల్లో విధించే పన్నులను వారు వసూలు చేసే వారు. ఆ నిధులతో అభివృద్ధి పనులు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వలంటీర్ల వ్యవస్థ, సచివాలయ వ్యవస్థలు ఏర్పడిన తర్వాత ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేస్తున్నా నిర్వహణకు మాత్రం నిధులు లేక పంచాయతీలు దిక్కులు చూస్తున్నా యి. పైగా గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత పంచాయతీలపై భారం పెరిగింది. కనీసం మంచినీటి సరఫరాకు నిధులు రాక పంచాయతీలే చేతి పంపులు, పైప్‌లైన్లు మరమ్మతులు చేయించుకుంటున్నాయి. మరోవైపు పాలనా పరంగా సైతం ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. స్టేషనరీ ఖర్చులు పంచాయతీలే భరించాల్సిన పరిస్థితి. సచివాలయాలకు ఏర్పాటు చేసిన కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లుకు సంబంధించిన బిల్లులను పంచాయతీ నిధుల నుంచి చెల్లించాల్సి రావడంతో పంచా యతీ పాలక వర్గాలు, కార్యదర్శులు సతమతమవుతున్నారు. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనివారికి జీతాలు ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయి.ఈ పరిస్థితులను ఎలా అధిగమించాలో అర్ధంకాని పరిస్థితుల్లో పాలక వర్గాలు ఇబ్బందులుపడుతున్నాయి.

పనులు చేసుందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

పంచాయతీల్లో చేసే చిన్నపాటి అభివద్ధి పనులకూ నిధులు లేక కాంట్రాక్టర్లు పనులు చేయ డానికి ముందుకు రావడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో పంచాయతీల్లో వీధి దీపాలు రిపేరుకు వస్తే మార్చలేని పరిస్థితి. పారిశుధ్య నిర్వహణకు నిధులు అంతంత మాత్రంగానే ఉండడంతో గ్రామాల్లో పారిశుధ్యం కుంటుపడింది. ఆర్థిక సంఘ నిధులతో పాటు పంచాయతీలకు వచ్చే పలు రకాల నిధులను ప్రభుత్వం మళ్లించడంతో పంచాయతీలు నిర్వీర్యం అవుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. పాలక ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలని పాలకవర్గాలు కోరుతున్నాయి.

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యం

మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

ప్రజాసంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోం మంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు టౌన్ లోని శ్రీరామా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శనివారం శ్రీరామ సొసైటీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్‌గా డాక్టర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, డైరెక్టర్లుగా బోడపాటి హనుమంతరావు, గోసాల శ్రీనివాసరావుల చేత రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా సొసైటీలలో నామినేటెడ్ పోస్టుల కింద చైర్మన్లు డైరెక్టర్లను నియమించడానికి అవకాశం కల్పించిన సిఎం జగన్‌కు కతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఎదుర్కోలేక రాజకీయ విమర్శలకు దిగుతున్నారని, వాటిని ధైర్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ.. దేశంలో గుజరాత్ రాష్ట్రం తర్వాత కేంద్రం నుండి అన్ని ఎక్కువ నిధులు అంధ్రప్రదేశ్ కు మాత్రమే వచ్చాయన్నారు. కొవ్వూరు నియోజకవర్గం వివిధ రోడ్లు నేషనల్ హైవేలతో మంత్రి తానేటి వనిత రూపురేఖలు మార్చారని తెలిపారు. మాజీ ఎంఎల్ఎ రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 175 ఎంఎల్ఎలు ఒక ఎత్తైతే కొవ్వూరు ఎంఎల్ఎ తానేటి వనితకు హోం మంత్రిగా ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



శ్రీరామసొసైటీ పాలకవర్గప్రమాణస్వీకారోత్సంలో మంత్రి , ఎంపీ

సొసైటీల అభివృద్ధికి పాలక వర్గాలు కృషి చేయాలి

చాగల్లు : సొసైటీ అభివద్ధికి పాలకవర్గాలు కృషి చేయాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మార్కొండపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సొసైటీ నూతన అధ్యక్షునిగా గంగిశెట్టి వీర వెంకట రమణమూర్తి, సభ్యులు తాడేపల్లి శ్రీనివాసు, అంబటి మురళీమోహన్‌లతో సొసైటీ కార్యదర్శి పి.వరలక్ష్మి శనివారం ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడు రమణమూర్తి మాట్లాడుతూ బోర్డు సభ్యులతో అధికారుల కలిసి సొసైటీ అభివద్ధికి కషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మట్టా వీరస్వామి, గ్రామ సర్పంచ్ కె. లక్ష్మీశివపోశి, ఉనగట్ల సొసైటీ అధ్యక్షులు ఆత్కూరి దోరయ్య, మండల వైసిపి అధ్యక్షులు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

9న నిర్వహించే ధర్నాల విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కేంద్ర ప్రభుత్వం ఆలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 9 నిర్వహించే ధర్నాను విజయవం చేయాలని కోరుతూ, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక శ్యామల సెంటర్ లో గల సిఐటియు కార్యాలయంలో సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాంబాబు, ఐ.ఎఫ్.టి.యు నాయకులు కె.జోజి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నులభారాలు మోపుతూ, కార్మికులను బానిసలుగా మార్చేందుకు 46 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారని, 3 వ్యవసాయ చట్టాల రూపంలో రైతాంగ భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నించారని విమర్శించారు. మోడీ విధానాలను రాష్ట్రంలో అమలు చేసే పార్టీలకు ప్రజలు, కార్మికులు, మేధావులు ఓటుద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 9



సమావేశంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

న క్విట్ ఇండియా స్ఫూర్తితో జరిగే జరిగే ధర్నాకు కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.ఎస్.మూర్తి, ఎఐటియుసినాయకులు కొండలరావు, సిఐటియూ జిల్లా నాయకులు బి. పవన్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌లో పలువురికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పెరవలి

కానూరు పిహెచ్‌సి పరిధిలో గల ఉసులుమర్రు గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ క్యాంపులో సాధారణ వైద్యంనిమిత్తం-100, గర్భిణులు-16, బాలింతలు-2, రక్తపోటు -42, మధుమేహం-68 కి వైద్య,పరీక్షలు చేసి చికిత్స అందించారు. అనంతరం పాఠశాలలో పిల్లలను పరీక్షించి చికిత్స వ్యక్తిగత శుభ్రత గురించి అవగాహన కల్పించినారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సూపెర్వైజర్ పి. రాజసులోచన తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నగరంలోని ద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను తెలుసుకోవడానికి భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర రాజమహేంద్రవరనం సిటీలో ఆగస్టు 21 నుంచి 24 వరకు నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్. రాజా తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం సిటీలో జరుగుతున్న ఈ సైకిల్ యాత్రలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈ సైకిల్ యాత్ర సిటీ మొత్తం మీదుగా నాలుగు రోజులు పాటు జరుగుతుందన్నారు. ఈ నాలుగు రోజుల్లో సిటీ లో ఉన్న ప్రతి విద్యా సంస్థకి ప్రతి హాస్టల్స్ కి ఈ సైకిల్ యాత్ర వెళుతుందని ఆ విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని ఆ సమస్యలను పరిష్కరించేంత వరకు ఎస్ఎఫ్ఐ పోరు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

విడవదని అన్నారు ఈ సైకిల్ యాత్ర దాదాపు 40 మంది విద్యార్థులతో జరుగుతుందన్నారు. దీనికి విద్యార్థులు, ప్రజలు సహకరించాలని కోరారు ఈ యాత్ర 21న ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ప్రారంభమవుతుందని ఎస్ కే ఆర్ మహిళ కళాశాల వద్ద 24న ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వై భాస్కర్ జిల్లా కమిటీ సభ్యులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం బస్తాలు అందజేత

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

మల్లిపూడి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ ప్రతినిధి ఎం.ధనరాజు కాపవరం గ్రామంలో గల 30బియ్యం బస్తాలు పేదకుటుంబాలకు అందజేశారు. ధనరాజు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా పేదలకు ఉచిత ఆహారపంపిణి, ఉచితంగా విద్య, వైద్యం అందించడం తో పాటు వద్దుల కొరకు వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఎంపికైన పేదలకు రూ.300 నుంచి రూ.800 వరకు పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నామని, అనాధ శవాల మట్టి ఖర్చులకొరకు రూ.5000 ఈ ట్రస్ట్ ద్వారా అందిస్తున్నట్లు ధనరాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో మట్టా సుబ్బారావు, సాకాపుల్లారావు, గెల్లా భాస్కర రావు, అయినం సుబ్బారావు పాల్గొన్నారు.

తెగుళ్లపై అవగాహన

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని గాదేలపాలెం గ్రామంలో రైతులు వరి సాగులో సంక్రమించే తెగుళ్ల నివారణ అంశాలపై అవగాహన సదస్సు శనివారం అగ్రికల్చర్ సైన్స్ కళాశాల విద్యార్థి ముత్యం యోగేందర్ రామ్ సాయి ఆధ్వర్యంలో నిర్వహించారు రామ్ సాయి మాట్లాడుతూ వరిలో ప్రధానంగా అగ్గి తెగులు ముందుగా తెగులు సుడి దోమ త్వరలో కాండర కుళ్లు వంటి తెగుళ్ల సంక్రమిస్తే వాటి నివారణకు తీసుకోవాలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు గళ్ళ కృష్ణ, గళ్ళ వెంకటేశ్వరరావు ఎర్రంశెట్టి రామారావు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు

కార్టూ'నిజం'



చంద్రబాబుపై దాడి అమానుషం

ప్రజాశక్తి-యంత్రాంగం

పుంగనూరు పర్యటనలో జాతీయ టిడిపి అధ్యక్షులు, మాజీ సిఎం నారా చంద్రబాబుపై జరిగిన దాడి అమానుషమని టిడిపి నాయకులు అన్నారు. **పెరవలి** : చంద్రబాబు నాయుడు తలపెట్టిన ప్రాజెక్టుల యుద్ధభేరి యాత్ర లో పుంగునూరు జరిగిన రాళ్లదాడి విధ్వంసానికి మండల తెలుగుదేశం నాయకులు నిడదవోలు నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి దాడిని ఖండించారు మాజీ నీటి సంఘం అధ్యక్షులు బూరుగుపల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షులు అతికాల రామకష్ణమ్మ తదితరులు చంద్రబాబుపై జరిగిన దాడిని ఖండించారు.**రాజమహేంద్రవరం** : ఆగష్టు 5: రాబోయే ఎన్నికల్లో ఓడిపోతామన్న అభద్రతాభావంలో సిఎం జగన్ ఉన్నారని, ఆ భయంతోనే ప్రతిపక్ష నాయకుడిపై దాడులకు తెగబడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కష్ణ అన్నారు. **కడియం:** మండలంలోని వేమగిరి గ్రామంలో తూర్పుగోదావరి జిల్లా బిసి సెల్ అధ్యక్షులు పితాని శివరామకష్ణ ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొని మహానాడు వేదికగా చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ మహాశక్తి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడానికి వైసిపి శ్రేణులు చేసిన దాడిని ఖండిస్తూ శనివారం మండలంలోని వేమగిరి గ్రామంలో ఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య పార్టీ నాయకుల్తులతో కలిసి కళ్లకు నల్ల రిబ్బనులు కట్టుకుని రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు.



వేమగిరిలో కళ్లకు నల్ల రిబ్బన్లుకట్టుకున్న రూరల్ ఎంఎల్ఎ బుచ్చయ్యచౌదరి నిరసన

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

కడియం : వైసిపి ప్రభుత్వంలో హంగులు, ఆర్భాటాలు, శిలాఫలకాలు తప్ప అభివద్ధి శూన్యం అని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఎంపీ దత్తత గ్రామమైన మండలంలోని పొట్టిలంక గ్రామంలో డెల్టా ఆధునీకరణ రూ.369 లక్షల నిధులతో 2020 సంవత్సరంలో ఆయన శంకుస్థాపన చేసిన పొట్టిలంక కాలువపై పెద్ద వంతెన నిర్మాణం నేడు అటక ఎక్కిందని గోరంట్ల ఎద్దేవా చేశారు.

8న చంద్రబాబు పురుషోత్తపట్నం సందర్శన

ప్రజాశక్తి-సీతానగరం

మాజీ సిఎం చంద్రబాబు ఈనెల 8న సీతానగరం మండలంలో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం సందర్శిస్తారని టిడిపి నాయకులు తెలిపారు. పర్యటన విజయవంతం చేయడానికి ముఖ్య నాయకులుతో శనివారం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని రాజమహేంద్రవరం పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు మాజీ మంత్రి కెఎస్ జవహర్, జోన్ 2 పోగ్రామ్ కోఆర్డినేటర్ రవియదవ్, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ మరియు రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి పరిశీలించారు. అనంతరం బొడ్డు వెంకటరమణ పార్టీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారపార్టీ ఈ నెల 8న చంద్రబాబు పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పర్యటన ఖరారైంది. అనంతరం రోడ్డు మార్గం ద్వారా కోరుకొండ చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. టిడిపి శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.



ఎంఎల్ఎ వెంకట్రావు వినతిపత్రంఇస్తున్న దృశ్యం

మణిపూర్ ఘటనలపై నిరసన

ప్రజాశక్తి-దేవరపల్లి

ఇటీవల మణిపూర్ లో జరిగిన గిరిజనులపై దాడులను నిరసన తెలియజేస్తూ శనివారం దేవరపల్లిలో క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీగా దేవరపల్లి ఎంఎల్ఎక్యాంప్ కార్యాలయమునకు వచ్చారు. ఎంఎల్ఎ తలారి వెంకట్రావు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన ఘటనలను ఖండించారు. అనంతరం ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు. **గోకవరం:** మండల కేంద్రమైన గోకవరంలో శనివారం క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వరసాల కుమారి ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనలపై నిరసన ప్రదర్శనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరిగిన ఘటనలకు కారకులను శిక్షించాలన్నారు. స్థానిక తహశీల్దార్ డి.సుగుణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వరసాల ప్రసాద్, తుర్రం సత్యవతి, నాగమణి, వెంకటలక్ష్మి రాయుడు పాల్గొన్నారు.

పేదలకు అండగా జగనన్న ప్రభుత్వం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

పేదలకు అండగా జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పచ్చ దనం, సుంద రీకరణ కార్పొరేషన్ చైర్మన్, రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ధవళేశ్వరంలో శనివారం బ్యారేజ్ లాక్ లైన్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో గత 40 సంవత్సరాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని స్థానికులు నివసిస్తున్నారు. ఆ నివాసాలకు ఇళ్ల పట్టాలు లేని కారణంగా గత ప్రభుత్వాలకు పలుమార్లు అనేక వినతులు అందజేశారు. ఈ సందర్భంగా చందన ఆ ప్రాంతంలో పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడారు. వైసిపి అధికారం లోకి వచ్చిన తరువాత రాష్ట్రం లో అర్హులకు 25 లక్షల ఇల్లు మంజూరు చేసిందన్నారు. బ్యారేజ్ లాక్ లైన్ ప్రాంతంలో ప్రతీ కుటుంబానికి ఇంటి పట్టా అందజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ ప్రాంతం గోదావరి పక్కనే ఉన్నా గత ప్రభుత్వం వైఫల్యాల వల్ల నీటి సమస్య ఏర్పడిందని ఆ సమస్యను అదిగమించేందుకు త్వరలోనే ఈ ప్రాంతంలో వాటర్ ట్యాంక్ రాబోతుందని, వాటర్ ట్యాంక్ నిమిత్తం రు.5.00 లక్షలు మంజూరు అయిన సంగతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జెసిస్ ఇంఛార్జి తాటికొండ విష్ణు మూర్తి, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితా రాణి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షట్టర్ బాషా స్థానిక నాయకులు రంగం బాలరాజు, మోర్త పావన మూర్తి, గోడి అనిల్ కుమార్, గ్రామ నాయకులు గోలి దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

కరపత్రాలు అందజేసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి -నిడదవోలు

టిడిపి మహానాడు సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోకు సంబంధించి కరపత్రాలను ప్రజలకు నియోజకవర్గ టిడిపి నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ నియోజకవర్గంలోని సమిశ్రగూడెం గ్రామం లో 3వ రోజు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ టిడిపి అధ్యక్షులు మద్దుకూరి శ్రీనివాస్, గజ్జరపు శ్రీనివాస్, వాకలపూడి వెంకటరత్నం, ఎస్సి సెల్ అధ్యక్షులు అంబటి వెంకటరమణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఫోట్రియ, వెంకీలను సన్మానిస్తున్న ఎంఎల్ఎ జక్కంపూడి రాజా

ఫొటోగ్రాఫర్లు సాంకేతికతను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-రాజానగరం

ఫొటోగ్రాఫర్లు వత్తి చాలా కీలకమైనదని, ప్రతి ఒక్కరు నైపుణ్యంతో కలిగిన సాంకేతిక పెంపొందించుకోవాలని రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. దివాన్ చెరువు గ్రామం ఎస్‌విపిసి కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ట్రేడ్‌ఫైయిర్ ఎగ్జిబిషన్‌ను రెండో రోజు శనివారం ఆయన సందర్శించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్ రే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వివిధ కంపెనీల ఫొటో ఎగ్జిబిషన్లో ఉత్పత్తులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెలుగు సినిమా ఫొటోగ్రఫీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పిజ.బిందా, తెలుగు సినిమా ఫొటోగ్రాఫర్ ఫోట్రియా వెంకీలను ఎంఎల్ఎ సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫొటోగ్రఫీ అధ్యక్షులు పోసాని వీరేంద్ర, జిల్లా అధ్యక్షులు కొని శ్రీను, గౌరవ అధ్యక్షులు అల్లు బాబి, గౌరవ సలహాదారులు కేతా శ్రీను,రావు, ఎస్ఎస్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు

జీతాలు చెల్లించాలని ఎపిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-తాళ్లపూడి

రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు జరిగి నెలలు గడుస్తున్నప్పటికీ బదిలీ అయిన వారిలో సుమారు 60 వేల మంది ఉపాధ్యాయులకు ఇంతవరకు ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడం అన్యాయమని ఎపిటిఎఫ్ తూర్పుగోదావరి జిల్లా శాఖ అధ్యక్షులు సున్నా దుర్గారావు అన్నారు. జీతాల కోసం శనివారం తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఎపిటిఎఫ్ నిర్వహించిన ధర్నా కార్యక్రమాలలో భాగంగా తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయం వద్ద దుర్గారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తహశీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ దీపక్ కు ఎపిటిఎఫ్ తరఫున వినతిపత్రం అందజేశారు. ధర్నా కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు రఘువీర శాస్త్రి, ఉపాధ్యాయులు కనకదుర్గ, శంకరం, రాము,అనిత, గంగాదేవి, పద్మావతి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న దృశ్యం

మానవత సేవా సంస్థ వితరణ

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ మరియు పల్లంట్ల మానవత బాడీ ఫ్రీజర్ కార్యాలయం నిర్వహకుడు ఆచంట రాంబాబు శనివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. దేవరపల్లి మండలం మానవత సేవా సంస్థ ప్రగాఢ సంతాపం తెలియజేసింది. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మానవత సంయుక్త కార్యదర్శి మరియు తణుకు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బోయపాటి రామలక్ష్మి మాట్లాడుతూ ఆచంట రాంబాబు కుటుంబం ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోయినా మానవత సేవా కార్యక్రమంలో పాల్గొని నిర్వహించేవాడని మరియు దేవరపల్లి మానవత సంస్థ తీరని లోటు అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా దేవరపల్లి మండల మానవత సంస్థ అధ్యక్షులు ఈదుపుగంటి నాగేశ్వరరావు మరియు జిల్లా అబివృద్ధి కమిటీ డైరెక్టర్ బల్ల సూరి చక్రం మానవత సంస్థ ద్వారా రూ.పదివేలు, మరియు బోయపాటి రామలక్ష్మి రూ.5 వేలు వారి కుటుంబ సభ్యులకు అందించినారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు బలుసు సత్యనారాయణ, బండి సూర్య ప్రకాశరావు ,పప్పు వెంకట రామారావు, ఉండవల్లి కష్ణారావు, ఎలమటి సత్యనారాయణ, ఆచంట సుభాష్ చంద్ర బోస్, ఇదుపుగంటి శివరాం ప్రసాద్, కూచిపూడి సత్యనారాయణ, నల్లమాటి రామారావు తదితర మానవత సభ్యులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి గ్రామంలో క్షత్రియ సంఘం వారికి కమ్యూనిటీ భవనన నిర్మాణం నిమిత్తం నిధులు మంజూరు చేయాలని దేవరపల్లి ఎంపిపి కెవికె.దుర్గారావుకు శనివారం ఆ సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. దేవరపల్లి గ్రామంలో మీసేవ కేంద్రం వద్ద ఉన్న తమ సంఘానికి చెందిన స్థలం వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణం నిమిత్తం రూ.6 లక్షల నిధులు మంజూరు చేయాలని ఎంపపిని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పచ్చ రామ గోపాల్, దుగ్గిన గంగాధర్, దుగ్గిన ప్రసాద్, క్షత్రియ సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంఘ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నిడదవోలు

ప్రస్తుత కార్యవర్గం పదవీకాలం ముగియడంతో నిడదవోలు పట్టణ స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక విరాట్ విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ సర్వసభ్య సమావేశంలో శనివారం జరిగింది. నిడదవోలు పట్టణ స్వర్ణకారుల సంఘం నూతన అధ్యక్షులుగా ర్యాలీ ఆనంద్, కార్యదర్శిగా అయినవిల్లి ఫణి కుమార్, కోశాధికారిగా తమిరి సతీష్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ప్రజాశక్తి - నిడదవోలు

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని వైద్యులు జి.సుధీర్ అన్నారు. నిడదవోలు మండలం కంసాలిపాలెం వెల్నెస్ సెంటర్ లో తల్లి పాల వారోత్సవాలను గ్రామ సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ రోజాపుష్పం తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** నేలటూరు పంచాయతీ వద్ద తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సర్పంచ్ యడ్లపల్లి ఉమా రజిని ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు.

నేరాలు ఘోరాలు

నాటు తుపాకీ కలిగిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కడియం

మండలంలోని జేగురుపాడులో నాటు తుపాకీ, మందు గుండు కలిగిన వ్యక్తిని కడియం పోలీసులు అరెస్ట్ చేశారు.కాజులూరు మండలం కుయ్యేరుకు చెందిన మానుపూడి దుర్గారావు వేమగిరిలో నివాసం ఉంటున్నాడు. ఆతడి వద్ద దేయింగా తయారు చేసిన సింగిల్ బోర్ గన్, దానికి ఉపయోగించే మందు గుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రెండు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

ప్రజాశక్తి – జగ్గంపేట రూరల్

మండలంలోని రెండు ఘటనల్లో గడ్డి మందు తాగి ఇరువురు మతి చెందినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. కాట్రావులపల్లికి చెందిన రాయుడు సత్యనారాయణ (67) కాళ్ళ నొప్పులు తాళలేక మద్యంతో పాటు గడ్డి మందు తాగడంతో బంధువులు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా శనివారం మరణించినట్లు తెలిపారు. మల్లిశాల గ్రామానికి చెందిన బొజ్జిని వీరబాబు భార్యతో గొడవ పడి గడ్డి మందు తాగాడు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

కట్నం కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి –తాళ్లరేవు

జీవీల గాడిమొగ పంచాయతీ పెద వలసలలో వివాహిత మహాలక్ష్మి మరణించిన కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. రామన్నపాలెంకు చెందిన పంతాడి నూకరాజు, పంతాడి చిన్న నూకరాజు, పంతాడి ధనలక్ష్మి, పంతాడి వెంకటేశ్వరులు, కాకినాడ జగన్నాథపురానికి చెందిన ఒలేటి నర్సవేణిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం

ప్రజాశక్తి-కడియం

ప్రేమించానని వెంటపడి, యువతిని మోసం చేసిన యువకుడి మీద కడియం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. జేగురుపాడు గ్రామానికి చెందిన ఒక యువకుడు అదే గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమించానంటూ, ఆమె వెంటపడి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. మూడు నెలలుగా ఆమెను శారీరకంగా లోబరుచుకున్నాడు. తీరా పెళ్లి ప్రస్తావన తీసుకురాగానే ముఖం చాటేయడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

కాలువలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి – సీతానగరం

శనివారం మిర్తిపాడు గ్రామానికి చెందిన వ్యక్తి తొర్రిగడ్డ కాలువలో గల్లంతయ్యాడు. పీతల శ్రీను కాలువ వద్ద చేపల కోసం వెళ్లి మిర్తిపాడు నుండి బొబ్బిల్లంక వెళ్లే తొర్రిగడ్డ కాలువ పంపింగ్ స్కీం వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

బండారులంక గ్రామం బ్యాంకు కాలనీకి చెందిన పడవల దేవి శుక్రవారం నుంచి కనిపించడం లేదని ఆమె భర్త వీర సుబ్బారావు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆమె ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 9440796562 నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ పరదేశి చెప్పారు.

ఆదిత్య విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థి యువత మారుతున్న వాతావరణం, ఎలక్ట్రికల్ డివైసెస్ వాడటం కారణంగా తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన కంటి సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. ఈ వైద్య శిబిరాన్ని శ్రీ కిరణ్ ప్రోగ్రామ్ మేనేజర్స్ కార్తీక్, రఘురాం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్స్ శేష, విజయ, శంకర్ పాల్గొన్నారు.

పథకాలు అందరికీ అందాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందివ్వడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు అన్నారు. శనివారం కొత్తపల్లిలో రెండో రోజు గడపగడప కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తుల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. పలువురు ఎంఎల్ఎకు గ్రామంలో సమస్యలు వివరించారు. అనంతరం స్థానిక నాయకులు గ్రామస్తులు ఎంఎల్ఎను పుష్పమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గవర రాజేశ్వరి నాగేశ్వరరావు, పాలని దొరబాబు, వైస్ సర్పంచ్ పొన్నగంటి రామకష్ణ, సానా నాగు, సత్తిరాజు ఆనాల సుదర్శన్ తదిత నాయకులు పాల్గొన్నారు. పిఠాపురం ఎంఎల్ఏ దొరబాబు తీరుపై కొత్తపల్లి వైస్ ఎంపిపి మాదిరెడ్డి దొరబాబు అసంపూర్తిగా ఉన్నారు. దీంతో రెండో రోజు నిర్వహించిన గడపగడప కార్యక్రమానికి ఆయన గైరాజరయ్యారు.

ప్రగతిలో గ్రీన్ బిల్డింగ్స్‌పై సదస్సు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గ్రీన్ బిల్డింగ్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాదం సుందరరావు, ఎస్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారుని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కృష్ణారావు మాట్లాడుతూ, సివిల్ ఇంజనీరింగ్ చదివే విద్యార్థినీ, విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు %ూజజజు% యొక్క విధి విధానాలను వివరిస్తూ, గ్రీన్ బిల్డింగ్స్ గురించి తెలిపారు. దీనిలో భాగంగా వేస్ట్ మేనేజ్మెంట్, ఎనర్జీ ఆప్టిమైజేషన్, సాలిడ్ వేస్టు మేనేజ్మెంట్ ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కె.సరోజారాణి, ఎం.వి.హరనాథ బాబు, ఎం.సతీష్, డైరక్టర్ ఎస్.శంభు ప్రసాద్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

ప్రధాన ఎన్నికల అధికారిగా జవహర్

ప్రజాశక్తి – యానాం

పుదుచ్చేరి ప్రధాన ఎన్నికల అధికారిగా పి.జవహర్‌ను నియమిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇంతవరకు కలెక్టర్ ఈ వల్లవన్ ప్రధాన ఎన్నికల అధికారిగా బాధ్యతలు నిర్వహించారు.



కనకాల పేట వద్ద కూలిన రక్షణ గోడ

నదిలో కలిసిపోతున్న లంక భూములు

ప్రజాశక్తి – యానాం

కనకాలపేట గ్రామాన్ని ఆనుకుని ఉన్న లంక భూములు గోదావరి నదీ గర్భంలో కలిసిపోతున్నాయని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది వచ్చిన వరదలతో ఏటిగట్టుకు ఆనుకుని ఉన్న రివిట్మెంట్ 20 మీటర్ల మేర గోదావరి వరద తాకిడికి కోతకు గురైంది. ఎన్నోసార్లు ఈ సమస్యపై అధికారులకు విన్నవించినప్పటికీ వారు నిర్లక్ష్యం వహించడంతో ఈ సంవత్సరం జూలై లో వచ్చిన వరదకు 40 మీటర్లకు చేరుకుందని వారు వాపోయారు. గౌతమీ గోదావరి వరద ఉధతి పెరగడంతో లంకలు కోతలకు గురవుతున్నాయని, కొబ్బరి చెట్లు సైతం గోదావరి నదిలో కలిసిపోతున్నాయని అంటున్నారు.

ఇండోర్ స్టేడియం మరమ్మతు పనుల పరిశీలిన

ప్రజాశక్తి – యానాం

స్థానిక వైయస్సార్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల పైకప్పు, జిమ్ రూమ్, ఫ్లోరింగ్ తదితర మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి పిడబ్ల్యుడి ఇఇ వీర సెల్వంతో కలిసి శనివారం పరిశీలించారు. నాణ్యమైన మెటీరియల్స్ ఉపయోగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జెఇలు పిల్లి భాస్కర్, యాళ్ల వీరాస్వామి, ఇండోర్ స్టేడియం ఇన్‌ఛార్జి నక్కల సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

వేడెక్కిన రాజకీయం..



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో రాజకీయ పరిణామాలు రోజురోజుకీ వేడెక్కుతున్నాయి. అధికార పార్టీలో ముఖ్యనాయకుల మధ్య సమన్వయ లోపం గురించి తెలిసిందే. ప్రతి నియోజకవర్గంలోనూ పరిపాటిగా మారాయి. ప్రధానంగా కోనసీమలో ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రి వేణు వర్గాల మధ్య ఉన్న విబేధాలు ఒక్కసారిగా బహిర్గతం కావటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాష్ట్ర నాయకత్వం చొరవ తీసుకుని సర్ది చెప్పినట్లు తెలుస్తోంది. తాజా రాజానగరం ఎంఎల్ఎ సోదరుడు జక్కంపూడి గణేష్ అదే పార్టీకి చెందిన యువజన నాయకుడిని దుర్భాషలాడినట్లు వస్తున్న వార్తలు రాజమహేంద్రవరంలో చర్చనీయాంశమయ్యాయి. తాజా పరిణామాలు జిల్లాలో మరో సారి కలకలం రేపుతున్నాయి. మరో వైపు పుంగనూరులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనపై రాళ్ల రువ్వటం జిల్లా రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగ మారింది. అధికార పార్టీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందంటూ టిడిపి శ్రేణులు ఆందోళన బాట పట్టాయి. మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో రాజకీయ పరిణామాలు రోజు రోజుకీ మారుతున్నాయి. ఆశావహులు పార్టీ పెద్దల ఆశీస్సుల కోసం క్యూ కడుతున్నారు. సిట్టింగ్‌లలోనూ టికెట్ భయం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలోనే ఎక్కడికక్కడ తమ ముఖ్యనాయకులు తమ ప్రాభవాన్ని చాటుకునేందుకు నాయకులు పోటీపడుతున్నారు.

తగ్గిన వరద... మిగిలిన బురద

కంటిమీద కునుకు లేకుండా 10 రోజుల పాటు కొనసాగిన గోదావరి వరద ఎట్టకేలకు ఈ వారం శాంతించింది. ఎగువ రాష్ట్రాలలో కురిసిన వర్షాలతో పాటు జిల్లాలోనూ కురిసిన వర్షాలు తోడవటంతో ప్రవాహం మరింత పెరిగింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గరిష్టంగా 15 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. దీంతో కోనసీమలోని 9 మండలాల్లో వరద ప్రభావం చూపించింది. 30 గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధం అయ్యాయి. ఫలితంగా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ప్రవాహం వేగం ఉన్నప్పటికీ నిత్యావసరాల కోసం పడవలపై ప్రయాణం చేశారు. వరద బాధితులకు ప్రభుత్వం సాయం అందించడంలో వెనుకబడింది. తాగునీరు సైతం అందుబాటులో లేక ఇబ్బందులు పడ్డామని కొంతమది ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెలలో మరో సారి వరద రానుందనే హెచ్చరికలు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. గోదావరి వరదల నుంచి కొంత ఊరట కల్పించందుకు లంక గ్రామాలను కలుపుతూ వంతెనలు నిర్మిస్తామంటూ పాలకులు చేసిన వాగ్ధానాలు నీటిమీద రాతలుగా మిగిలాయి. అదే విధంగా గోదావరి గట్ల పటిష్టత ప్రశ్నార్థకంగ మారింది. ఇప్పటికైనా పాలనా యంత్రాంగం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. తాజా వరదల నేపథ్యంలో పంట నష్ట జరిగింది. ఉద్యానపంటలుపూర్తిగా దెబ్బతిన్నాయి. అధికారులు త్వరిత గతిన చర్యలు చేపట్టి ప్రభుత్వం నుంచి సాయం అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొండ దిగనంటున్న కూరగాయలు

కూరగాయల ధరలు కొండదిగనంటున్నాయి. టమోటా ధరలు గరిష్టంగా కేజీ రూ.140 చొప్పున, కిలో మిచ్చి రూ.80 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. రైతు బజార్‌లో సబ్సిడీ టమోటా కోసం కొనుగోలు దారులు గంటల తరబడి బారులు తీరాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపుగా నెల రోజులుగా ధరలు కొండదిగనంటున్నాయి. మరో వైపు బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. సన్నరంక బియ్యం మార్కెట్లో కొనుగోలు చేయాలంటే రూ.60 పైమాటే. ఇప్పటికైనా పాలకులు చొరవతో ధరలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మణిపూర్ అమానుషాలపై నిరసనలు

మణిపూర్‌లో జరిగిన అమానుష ఘటనలపై ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు, క్రైస్తవ సంఘాలు చేపట్టిన ఆందోళనలు ఈ వారంలో మిన్నంటాయి. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గ వైఖరిని ముక్త కంఠంతో ఖండిస్తున్నారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఐద్వా సంఘం ఆధ్వర్యాన చేపట్టిన ర్యాలీకి జిల్లాలో విద్యార్థులు, ప్రజాస్వామ్య వాదులు బ్రహ్మరధం పట్టారు. మణిపూర్ ఘటనలు కలవరానికి గురి చేశాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

ప్రజాశక్తి – కాకినాడ కార్పొరేషన్

జగన్నాథపురం కోకిల రెస్టారెంట్ నుంచి హీరో హోండా షోరూం వరకు రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కోరారు. శనివారం జగన్నాథపురం వాసవి కళ్యాణ మండపం రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోతున్న యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జగన్నాథపురం వరకు రోడ్డు విస్తరణ చేపట్టినట్టు చెప్పారు. ఆనందభారతి నుంచి వైఎస్ఆర్ బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరణ చేపట్టమన్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య పరిష్కారంతోపాటు ఆస్తి విలువలు పెరిగాయని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు చోడిపల్లి ప్రసాద్, నంద, దుర్గాప్రసాద్, అదరపు కమిషనర్ నాగ నరసింహారావు, సిటీ ప్లానర్ హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి 'నా భూమి నా దేశం'

ప్రజాశక్తి-గండేపల్లి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద శనివారం ఎంపిడిఒ బిఎస్‌కె.రామన్ ఆధ్వర్యంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 వ తేదీ నుంచి ప్రారంభంకానున్న నా భూమి- నా దేశం కార్యక్రమంపై పంచాయతీ మండల పరషత్ అభివద్ధి అధికారి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొక్కలు నాటడం, వసుధకు వందనం, స్వాతంత్ర్య సమరయోధులు మరియు వీరుల కుటుంబీకులను సత్కరించడం వంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

చంద్రబాబుపై వైసిపి దాడి అమానుషం

ప్రజాశక్తి – కాకినాడ కార్పొరేషన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుపై పుంగనూరులో వైసిపి రౌడి మూకల దాడి అమానుషమని మాజీ శాసనసభ్యులు వనమాటి కొండబాబు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడానికి మంత్రి పెద్దిరెడ్డి చేసిన దాడిని ఖండిస్తూ దుమ్ములపేట ప్రధాన రహదారిపై పార్టీ శ్రేణులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాయలసీమ ప్రాంతాన్ని తన సొంత జాగీరులా భావిస్తూ పాలన సాగిస్తున్నాన్ని, రాష్ట్రంలో ఉన్న ఇసుక, మట్టిని పెద్దిరెడ్డి మైనింగ్ మాఫియాతో రూ.వేల కోట్ల ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారన్నారు. పోలీసుల సమక్షంలో తెలుగుదేశం పార్టీ నాయకుల, కార్యకర్తలపై వైసిపి దాడి చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల సునీత, చిక్కాల సత్యవతి, మీసాలు సునీత, మూగు చిన్ని, అంబటి చిన్న, తుమ్మల రమేష్, కోపనాతి నాగ కుమారి, నూరుకుర్తి లోవలక్ష్మి, పిర్ల లక్ష్మి ప్రసన్న, వడిసెల దాలమ్మ, కడలి వరలక్ష్మి, వీరంరెడ్డి వెంకట లక్ష్మి, వల్లపు సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మురారిలో గడప గడపకూ..

ప్రజాశక్తి-గండేపల్లి

మురారి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉప సర్పంచ్, యువ నాయకులు జాస్తి వసంత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు హాజరయ్యారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు పథకాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ఎ చంటిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు కచ్చితంగా చేరినందునే ఇంత ధైర్యంగా ప్రతి గ్రామంలో తిరుగుతున్నామన్నారు. గ్రామంలో వైసిపి పరిపాలన పట్ల పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంతగా లబ్ధి చేకూర్చిన పార్టీ పనితీరు పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొరబాబు, జెడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు, వైస్ ఎంపిపి కుంచే రాజా, ఎఎంసి చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపిడిఒ వెంకటరామన్, తహశీల్దారు కెవిఎస్.సత్యనారాయణ, కార్యదర్శి పి.శిరీష పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పార్టీకి పతనం మొదలైంది

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

రాష్ట్రంలో వైయస్సార్ పార్టీకి పతనం మొదలైందని పిఠాపురం మాజీ ఎంఎల్ఎ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్.వర్మ అన్నారు. మూలపేటలో గ్రామ కమిటీ నాయకులు కంబాలి రమణ ఆధ్వర్యంలో వైసిపి నుంచి సుమారుగా 80 మంది మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్ వర్మ ఆధ్వర్యాన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మత్స్యకారు కుటుంబాలను ఆదుకోవడంలో విఫలం అయ్యిందన్నారు. కాలుష్య పరిశ్రమకు అనుమతులు ఇచ్చి వారికి జీవనాధారం లేకుండా చేసిందని తెలిపారు. మూలపేటలో టిడిపి హయాంలో 90 శాతం వరకూ రోడ్లు వేసి అభివద్ధి చేసామని, ఇక్కడ మత్స్యకారులకు ఉపయోగ పడేలా మల్టీపర్పస్ హాల్ కేటాయిస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక సచివాలయ కార్యాలయంగా మార్చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి సత్యానంద రెడ్డి, మేరుగు సూరిబాబు, కంబాల రమణ, ఉప్పాక, మరియు మత్స్యకార నాయకులూ కొర్ని రమణ, సురాడ శ్రీను, మేరుగు భూషణం, చోడిపల్లి ప్రసాద్, వోసిపల్లి అప్పన్న, బొందు జగన్నాధం, సీకోటి నానాజీ, త్రిమూర్తులు, మరియు బత్తుల చైతన్య రాజేష్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

మహిళా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మీ సత్యనారాయణమూర్తి అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ – మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వలసపాకల గ్రామంలో ఆమె పర్యటించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో గురినంచారు. వివరించారు. ఈ కార్యక్రమంలోమాజీ ఎఎంసి చైర్మన్ కర్రి వెంకట్రాజు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి మట్టా ప్రకాష్ గౌడ్, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు బుంగా సింహాద్రి నాయకులు తాతపూడి రామకృష్ణ, కొల్లుబోయిన సూరిబాబు, కొల్లుబోయిన అచ్యుత్, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ కేశబోయిన ఏడుకొండలు, పాలిక ఉషారాణి, పలివెల త్రిమూర్తులు గాయత్రి, పిల్లి అప్పారావు, పిల్లి రామకష్ణ, బొజ్జ భవాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి – కాకినాడ కార్పొరేషన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో సామర్లకోట రానున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. సీఎం పర్యటనలో భాగంగా కాకినాడ నగరపాలక సంస్థ తరుపున పైలాన్ ఏర్పాటుతోపాటు మరికొన్ని సౌకర్యాల కల్పన బాధ్యతను నగరపాలక సంస్థ పర్యవేక్షిస్తోంది. ఇందులో భాగంగా డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అధికారులతో కలిసి పైలాన్ ఏర్పాటు పనులను పరిశీలించారు. అందుకు అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి, ఇఇ పి.వెంకట్రావు, ఎఇ వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

ఎపిలో మహిళా జీవనోపాధి భేష్

ప్రజాశక్తి – తాళ్లరేవు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలవుతున్న మహిళా జీవనోపాధిపై హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర బందం శనివారం తాళ్లరేవులో పర్యటించారు. మండలంలో స్వయం సహాయ సంఘాలు నిర్మాణం, బలోపేతం, మహిళా సభ్యుల జీవనోపాధి, అభివద్ధిని వారు అధ్యయనం చేశారు. ఈ మేరకు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాదుల మిషన్ సిఇఒ అనిల్ శర్మ, మిషన్ ఎగ్జిక్యూటివ్ రిషి మాల్టా , ప్రాజెక్ట్ మేనేజర్ రజత్ శర్మ బృందం గోదావరి మహా సమాఖ్య మహిళా సభ్యులతో చర్చించారు. వారి జీవన ప్రమాణ స్థాయి ఏ విధంగా అభివృద్ధి చెందింది అనే విషయాలను సమాఖ్య సభ్యులు బృందానికి వివరించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. తాళ్లరేవు ఎంపిఎం అర్.సన్యాసిరావు, సిసి రఘురాం, వెంక టేశ్వర్లు, మహాలక్ష్మి, నూకరత్నం, సునీత, మహేష్, కె.నరేష్ పాల్గొన్నారు.

కాలువలో గుర్రపు డెక్క తొలగించాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

నాగులపల్లి మూలపల్లి కాలువలో గుర్రపు డెక్క తొలగించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం శాఖ కార్యదర్శి కె.నాగేశ్వరరావు కోరారు. శనివారం నాగులపల్లిలో కెవివి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రేషన్ ద్వారా కందిపప్పు ఇతర నిత్యావసర వస్తువులు ప్రజలకు అందేలా చూడాలని అధికారులు కోరారు. మండలంలో ఉన్న కాలవల్లో గుర్రపు డెక్క పెరిగి సాగు చేసేందుకు నీరు సక్రమంగా రావడం లేదని దీనిపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రాల అప్పారెడ్డి, జివి.సుబ్బిరెడ్డి, జి.సునీత, సిహెచ్.నారాయణరెడ్డి, జివి.లక్ష్మి పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-పెదపూడి

విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరు వేసుకునే ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. గొల్లలమామిడాడ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల 1982-1983 సంవత్సర పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వైభవంగా నిర్వహించినట్లు రెమ్మలపూడి రామకష్ణ చౌదరి తెలిపారు. సుమారు 40 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి యోగక్షేమాలు తెలుసుకుంటూ గడిపారు.

వీరాంజనేయులుకు డాక్టరేట్

ప్రజాశక్తి గండేపల్లి

ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐత వీరాంజనేయులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. వీరాంజనేయులు సమర్పించిన ఎ జెడ్ 31/ ఎస్.ఐ.సి/ గ్రాఫిటీ రీన్‌ఫోర్స్ మెటల్ మ్యాట్రిక్స్ హైబ్రిడ్ మిశ్రమాలపై ఫాబ్రికేషన్, క్యారెక్టరైజేషన్ మరియు ట్రైబోలాజికల్ అధ్యయనాలు థీసిస్‌పై ఈ డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. ఆయనను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషా రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి అభినందించారు.